క్లుప్తంగా

మన ఊరు - మన బడి ప్రారంభం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బాడ్సి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మన ఊరు - మన బడి కార్యక్రమాన్ని సర్పంచి కోల గంగాధర్‌తో కలిసి ఎంపీపీ లతా కన్నీరాం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ..విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాల, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఎంపీటీసీ రమేష్, డీసీసీబీ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, కో–ఆప్షన్ అజీమ్, ఎంపీడీవో లింగం, హెచ్‌ఎంలు రాజ్యలక్ష్మి, కరుణాకర్‌రెడ్డి, తదితరులున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



సిరికొండ: గోసంగి కులస్తులు అన్ని రంగాల్లో ఐక్యంగా రాణించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లెల సాయిచరణ్ కోరారు. పందిమడుగులో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. గోసంగిల పేరిట బేడ బుడగ జంగాల వారు తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రాలు రద్దయేంతవరకు గోసంగిలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. డీఎల్‌ఎసీసీ కమిటీ వేసేంతవరకు పోరాడాలని కోరారు. నాయకులు గంగ నరసయ్య, భాస్కర్ ధర్మపురి పాల్గొన్నారు.

చిన్నయ్య కుటుంబం ఎంతో మందికి స్ఫూర్తి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన స్వర్గీయ జోరుపల్లి చిన్నయ్య కుటుంబం ఎంతో మందికి స్ఫూర్తి అని ధర్పల్లి జెడ్పీటీసీ, ఒలింపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. కేశాపూర్‌లో ప్రభుత్వ ప్రైమరీ పాఠశాల ఆవరణలో జోరుపల్లి చిన్నయ్య జ్ఞాపకార్థంగా వారి కుటుంబం నిర్మించిన అదనపు తరగతి గదిను మంగళవారం జగన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో పిల్లలు ఆడుకునే వస్తువులను ఎమ్మెల్యే సహకారంతో ఏర్పాటు చేస్తానని అన్నారు. సర్పంచ్ మల్లె వనిత, గూపన్‌పల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ విఠల్ రెడ్డి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, హెచ్‌ఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

డిచ్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో రకాల సౌకర్యాలు కల్పించి, శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు డిచ్‌పల్లి ఎంపీడీవో గోపిబాబు తెలిపారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు రాగిజావ, ఉచిత నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ ఏడవ బెటాలియన్‌లో కమాండెంట్ ఎస్‌వీ సత్యశ్రీనివాసరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేశారు. తెలంగాణ యూనివర్సిటీలో ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు తెయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్‌ఆరతి తెలిపారు.

పశువుల అక్రమ రవాణ చేస్తే చట్టరీత్యా చర్యలు

ఇందల్వాయి: బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై నిఘా పెంచాలని డిచ్‌పల్లి సీఐ కృష్ణ తోటి పోలీసులకు సూచించారు. ఇందల్వాయి పశువుల సంతలో పశువుల వ్యాపారులతో ఆయన మంగళవారం మాట్లాడారు. సరైన అనుమతులు లేకుండా ఆవులు, ఇతర పశువులను అక్రమంగా తరలించవద్దని, పశువులను వధిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఆయన వెంట ఇందల్వాయి ఎస్సై నరేష్ ఉన్నారు.

దోపిడీ రాజకీయాలకు స్వస్తి పలుకుదాం



నిజామాబాద్‌అర్బన్: అగ్ర కుల రాజకీయాలకు స్వస్తి పలకాలని ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. అణగారి వర్గాల సంపదని ఆక్రమిస్తున్న అగ్రకులాల రాజకీయాలకు సమాధి చేయడానికి అణగారిన కులాలను అధికారంలోకి తీసుకురావడానికి పార్టీని స్థాపించినట్లు తెలిపారు. ఈ జిల్లాలో సంపదను దోచుకుంటున్న బీఆర్‌ఎస్ పార్టీ అధికార మదాన్ని దించడానికి పార్టీని ప్రారంభిస్తున్నామని తెలిపారు. జిల్లాలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పోటీ చేస్తుందని అన్నారు. మాక్లూర్ నుంచి పులాంగ్ చౌరస్తా వరకు పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. నాయకులు సుమన్, ప్రేమ్, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కరువు

- వలు చోట్ల పూర్తికాని మన ఊరు-మన బడి పనులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



నల్లవెల్లి ప్రాథమిక పాఠశాలలో నీటి వసతి లేని మూత్రశాలలు



తిర్మన్‌పల్లి హైస్కూల్‌లో శిథిలావస్థకు చేరుకున్న మూత్రశాలలు

ఇందల్వాయి: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 33 ప్రాథమిక, 5 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు నాలుగున్నర వేల మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో మూత్రశాలల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొన్నింటికి డోర్లు లేకపోవడం, మరి కొన్నింటికి నీటి సరఫరా లేకపోవడం, పరిశుభ్రంగా లేకపోవడం వంటి స్థితిలో ఉన్నాయి. దీంతో విద్యార్థులు సరైన సమయంలో కాలకృత్యాలు తీర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొదటి విడత 17 పాఠశాలలు మనఊరు–మనబడి పథకం కింద ఎంపిక చేశారు. కానీ ఆయా పాఠశాలలో ఎక్కడా కూడా పనులు పూర్తి కాకపోవడం గమనర్హం.

నూతన విద్య క్యాలెండర్ నియమాలు అమలయ్యేనా?

తెలంగాణ విద్యాశాఖ నూతన విద్య క్యాలెండర్ నియమాల ప్రకారం వారానికి మూడు నుంచి ఐదు పీరియడ్లు విద్యార్థులతో ఆటలు ఆడించడం, యోగాభ్యాసం, ధ్యానం తప్పనిసరి చేశారు. కానీ చాలా పాఠశాల్లో పీఈటీలు లేకపోవడం వల్ల విద్యార్థులు క్రీడా నైపుణ్యాలు సాధించలేకపోతున్నారు. రోజు కనీసం అరగంట విద్యార్థులతో పుస్తక పఠనం చేయించాలి. కథల పుస్తకాలు, మేగజీన్లు, వార్తాపత్రికలు ఏవైనా చదివించాలి. పాఠశాలల్లో సరైన గ్రంథాలయ సౌకర్యాలు లేకపోవడం వల్ల విద్యార్థుల్లో పఠన సామర్థ్యం తగ్గి సామాజిక అంశాలపై పట్టు సాధించలేక పోతున్నారు.

వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత

మండలంలోని మొత్తం 46 ప్రభుత్వ పాఠశాలల్లో 205 మంది ఉపాధ్యాయులు అవసరం ఉండగా 180 మంది మాత్రమే ఉన్నారు. అలాగే చాలా చోట్ల కొందరు ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా డుమ్మా కొడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఖాళీలు భర్తీ చేయాలి

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పడిపోకుండా ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఉపాధ్యాయ ఖాళీలను కూడా భర్తీ చేయాలి. మన ఊరు–మన బడి పనులు తొందరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలి. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్ది, నాణ్యమైన విద్యా బోధన జరిగేలా చూడాలి.

– చింతల సుధీర్, బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు, ఇందల్వాయి

పనులు వేగంగా పూర్తి చేస్తున్నాం

ఎంపికైన 17 పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. బడిబాట చేపట్టి పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధ్యాయుల ఖాళీల వివరాలుపై అధికారులకు నివేదించాం.

–శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి ఎంఈవో, ఇందల్వాయి.

సంబురంగా విద్యా దినోత్సవం



మెడికల్ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపల్ ఇందిర

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాల్లో విద్యా దినోత్సవం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీలు తీశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 9 ఏళ్లలో విద్యా రంగంలో సాధించిన అభివృద్ధిని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మధ్యాహ్న భోజన పథకం, ఉచిత స్కూల్ యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, పోషకాహారం పంపిణీ తదితర పథకాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేసిన కృషిని ప్రజాప్రతినిధులు వివరించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు – సాక్షి నెట్‌వర్క్



మల్లాపూర్ పాఠశాలలో ..



ధర్పల్లిలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు



పెద్ద వాల్గోట్ పాఠశాలలో..

కేసులన్నింటినీ ఎత్తివేయాలి



ఖలీల్‌వాడి: పౌర హక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ సహా 152 మందిపై పెట్టిన ఉపా కేసును వెంటనే ఎత్తివేయాలని, చట్టాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో నిరసన ప్రదర్శన చేశారు. వనమాల కృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో గౌరవం ఉన్న వ్యక్తులకు మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలు చేసి, దేశద్రోహం కేసును బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర కోశాధికారి ఆల్గోట్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై గొంతెత్తిన వారిపై దేశద్రోహం చట్టం క్రింద జైళ్లల్లో పెట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. నాయకులు నరేందర్, వెంకన్న, దేవారం, రాజేశ్వర్, పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి దేశానికి ఆదర్శం



విద్యార్థులతో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే



పార్టీలో చేరుతున్న టీవీ టెక్నీషియన్ సభ్యులు

- అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌అర్బన్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి దేశానికే ఆదర్శమని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా అన్నారు. మంగళవారం విద్యాదినోత్సవం సందర్భంగా నగరంలో ఎల్లమ్మ గుట్ట ప్రాథమిక పాఠశాలలో రూ.25.8 లక్షలు, వినాయక్ నగర్ ప్రాథమిక పాఠశాలలో రూ.30.81 లక్షలు, వెంగల్‌రావునగర్ ఉన్నత పాఠశాలలో రూ.53.20 లక్షలతో అభివృద్ధి చేయగా..ఎమ్మెల్యే వాటిని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమానికి రూ.7,250 కోట్ల ఖర్చు చేసిందన్నారు. నేటి నుంచి ప్రభుత్వ బడుల్లో రాగి జావ అందించడానికి శ్రీకారం చుట్టుమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరడానికి ఆసక్తి

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ నగరాభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్‌ఎస్‌లో చేరడానికి ఆసక్తి చూపుతున్నారని అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా అన్నారు. మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే సమక్షంలో టీవీ టెక్నీషియన్ యూనియన్ సభ్యులు 100 మంది ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు తెలపాలన్నారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, టీవీ టెక్నీషియన్ యూనియన్ సభ్యులు ప్రశాంత్, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారులకు ఘన సన్మానం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): తైవాన్ దేశంలో ఈ నెల 13 నుంచి 17వరకు జరిగిన ఏషియన్ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకారిణులను ఆర్‌సీవో మేరి యేసుపాదం ఘనంగా సన్మానించారు. డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి) గురుకుల బాలికల పాఠశాల/కళాశాలలో మంగళవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గురుకుల క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో రాణించడం అభినందనీయమన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి.ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బొజ్జ మల్లేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి, డీసీవో సంగీత, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థులు ఇష్టపడి చదవాలని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు. నగరంలోని నాగారం 300 క్వార్టర్స్‌లోని జీపీఎస్ జెండాగల్లీ, జీహెచ్‌ఎస్ ఖలీల్ వాడి పాఠశాలలను మేయర్ సందర్శించారు. లైబ్రరీ కార్నర్‌ను ప్రారంభించి, పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రాంచందర్, మంజుల, కవిత, శ్రీనివాస్, శైలజ పాల్గొన్నారు.

గడ్కోల్ ప్రభుత్వ పాఠశాలలో..

సిరికొండ: గడ్కోల్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు యూనిఫాంలను సర్పంచ్ దేవ గౌడ్ మంగళవారం పంపిణీ చేశారు. ఎంపీటీసీ గంగారం వీడీసీ చైర్మన్ శంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ స్వామి, హెచ్‌ఎం లాల్ సింగ్ పాల్గొన్నారు.

రామేశ్వర్‌పూర్ తండా పాఠశాలలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రామేశ్వర్‌పూర్‌తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, దుస్తులను మంగళవారం ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మాలోత్ రవీందర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు పాఠశాలల్లో వసతులు కల్పిస్తోందన్నారు. సర్పంచ్ లక్ష్మీ రంగారావు, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్



పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ సిటీ: తెలంగాణలో విద్యారంగం ప్రగతి బాటలో ముందుకు సాగుతుందని, కార్పొరేట్ విద్యారంగాన్ని తలదన్నేలా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతను ఇస్తోందని, వారికి ఇంగ్లిష్ మీడియంలో బోధన, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, పౌష్టికాహారం వంటి విద్యా అభివృద్ధి పథకాలను రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తున్న నేపథ్యంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలం గుండారంలో దశాబ్ది ఉత్సవాలలో భాగంలో మంగళవారం 'మన ఊరు – మన బడి' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం రూ.13.34 లక్షలతో నిర్మించిన గదులను, ఉర్దూ మీడియం పాఠశాలలో రూ.11.71 లక్షలతో నిర్మించిన గదులను బాజిరెడ్డి ప్రారంభించారు. అనంతరం స్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు, పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫార్మ్స్, పంపిణీ చేసి, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.15 లక్షలతో పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు డిజిటల్ తరగతి గదులను ప్రారంభించారు. బాజిరెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలను సీఎం కేసీఆర్ సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారని, దీనికి ఇటీవల ప్రభుత్వ పాఠశాలలో చేరుతున్న విద్యార్థుల నమోదే ఇందుకు నిదర్శనమని అన్నారు. అనంతరం బీజేపీ నేతలపై విమర్శలు చేశారు. మాజీ ఎమ్మెల్సీ వీజీ గంగాధర్ గౌడ్, ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, డీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్, గుండారం సర్పంచ్ లక్ష్మణ్ రావు, ఎంపీపీ అనూష, జెడ్పీటీసీ సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా జగన్నాథ యాత్ర



నిజామాబాద్ సిటీ: నగరంలోని రాంగోపాల్‌వీధిలో ప్రతి సంవత్సరం నిర్వహించే జై జగన్నాథ యాత్ర ఘనంగా నిర్వహించారు. విజయవంతం చేసిన భక్తులకు మహేశ్ మహారాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

ధర్పల్లి మండల కేంద్రంలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని గోవర్ధనగిరి మాల గుట్టపై గల జగన్నాథ ఆలయ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పూరి నుంచి తీసుకువచ్చిన శ్రీకృష్ణ, బలరామ, సుభద్ర, విగ్రహాలను పల్లకిలో ఉంచి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేక పూజలను చేపట్టారు.

సమాచారం..

నేటి రైతు సదస్సును విజయవంతం చేయండి

డిచ్‌పల్లి: జిల్లా కేంద్రంలోని ఎన్‌ఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఏ.చిన్నయ్య మంగళవారం కోరారు. దశాబ్ది ఉత్సవాలు సరే.. రైతాంగ సమస్యల పరిష్కారం ఏదీ..అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు.

స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమల గోవింద వనమాల క్షేత్రంలో 15 ఏళ్ల లోపు పిల్లలకు బుధవారం ఉదయం 7 నుంచి 11.30 గంటల వరకు స్వర్ణామృత ప్రాశన మందు పంపిణీ చేయనున్నట్లు మా పల్లె చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఇందూరు అన్నమయ్య నర్సింహారెడ్డి మంగళవారం తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	60,750	వెండి (కిలో)	75,500
22 క్యారెట్స్	56,008		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	240
		లైవ్	180
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	36	60	క్యాప్సికం	60	80
బెండకాయ	20	40	గాజరుగడ్డ	30	50
బీరకాయ	40	60	పచ్చిమిర్చి	80	110
దొండకాయ	20	40	దోసకాయ	10	20
బీర్నిసుకాయ	100	130	ఆలుగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిగడ్డ	15	30
వంకాయ	25	50	గోబిపువ్వు	40	60
పాలకూర	30	50	బీట్‌రూట్	30	50
మెంతికూర	70	90	గోరు చిక్కుడు	50	70
కొత్తిమీర	80	100	చిక్కుడుకాయ	50	70
పుదీనా	50	70			

– ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ఫ్లాష్ (ఇంగ్లీష్ - 2డీ) - 10.10 ఆది పురుష్ (తెలుగు) - 12.50, 4.10, 7.30, 10.50
స్క్రీన్-2	ఆది పురుష్ (తెలుగు) - 10.30, 4.00 10.45 ; ఫ్లాష్(ఇంగ్లీష్ - 2డీ) - 10.45
స్క్రీన్-3	ఆది పురుష్ (తెలుగు) - 1.30, 7.00, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆది పురుష్ (తెలుగు - 3డీ) -8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-2	ఆది పురుష్ (తెలుగు - 3డీ) - 11.00, 2.45, 6.30, 10.15
స్క్రీన్-3	ఆది పురుష్ (తెలుగు - 2డీ) - 10.30, 2.15, 6.00, 9.45
స్క్రీన్-4	ది ఫ్లాష్ (తెలుగు) -12.45 ట్రాన్స్‌ఫార్మర్స్ (ఇంగ్లీష్ - 2డీ) -3.55 ది ఫ్లాష్ (ఇంగ్లీష్) - 6.50, 10.00
దేవి	విమానం
నటరాజ్	ఆది పురుష్ (హిందీ)
లలితామహల్	ఆది పురుష్ (తెలుగు)
విజయ్	ఆది పురుష్ (తెలుగు)

సంక్షిప్తం

నగర బీసీ మహిళ అధ్యక్షురాలిగా శోభావతి

నిజామాబాద్‌అర్బన్: నగర బీసీ మహిళా అధ్యక్షురాలిగా శోభావతి నియమితులైనట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ తెలిపారు. నగరంలో మంగళవారం నియామక పత్రం అందించారు. మహిళల అభివృద్ధికి పాటుపడతానని ఆమె తెలిపారు.

వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో యోగా శిబిరం

నిజామాబాద్ సిటీ: వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగాపై అవగాహన శిబిరం నిర్వహించారు. స్థానిక సరస్వతి నగర్ కమ్యూనిటీ భవనం ఫ్రీడమ్ పార్కులో జరిగిన శిబిరంలో వెల్‌నెస్ సెంటర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురికి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను అందించినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. సీఈఐఆర్ ద్వారా వాటిని గుర్తించి బాధితులకు అందించినట్లు చెప్పారు. సెల్‌ఫోన్ పోతే నేరుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్ వివరాలను నమోదు చేయాలని తెలిపారు.

అధికారులు పూర్తిగా విఫలమయ్యారు

ఖలీల్‌వాడి: బీసీ కులాలకు రూ.లక్ష రుణాన్ని ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం, అందుకు అనుగుణంగా కుల ధృవీకరణ, ఆదాయ పత్రాలు జారీ చేయడంలో రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్ కార్యాలయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం నేత మల్యాల గోవర్ధన్ ఆరోపించారు. ప్రభుత్వం దరఖాస్తు చేసుకోవడానికి కోసం తేదీలను పొడిగించాలని డిమాండ్ చేశారు.

ఉపా కేసులను వెంటనే ఎత్తివేయాలి

సిరికొండ: రాష్ట్రంలో ప్రజా సంఘాల నాయకులపై పెట్టిన దేశద్రోహం కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజా పంథా ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి ఆర్ రమేష్ డిమాండ్ చేశారు. రాజా ద్రోహం కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో ప్రజా పంథా ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు

సిరికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం ఎన్నో రకాల సౌకర్యాలను కల్పిస్తున్నాయని జెడ్పీటీసీ మాన్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ రాజారెడ్డి ఎంపీడీవో లక్ష్మీ ప్రసాద్ పాల్గొన్నారు.

సీఆర్‌ఎంఎఫ్ చెక్కు అందజేత

డిచ్‌పల్లి: గొల్లపల్లికి చెందిన బాధితురాలు గుడాల సాయవ్వకు మంగళవారం మాజీ ఎమ్మెల్సీ వీ.గంగాధర్‌గౌడ్ రూ.75,800ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. సర్పంచ్ లింగం యాదవ్, నాయకులు రవి పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలి

ధర్పల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పంట సాగు చేయడానికి కొత్త రుణాలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని ఏఐపీకేఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయంలో ఆర్ఐ రవికి వినతిపత్రం అందజేశారు. నకిలీ విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి బాబన్న నాయకులు సాయా రెడ్డి, గంగారెడ్డి పాల్గొన్నారు.